

పోచమ్మకు నైవేద్యం

మెట్‌పల్లి : వివిధ గ్రామాల్లో మహిళలు పోచమ్మ తల్లికి ఆదివారం బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



నృసింహునికి పూజలు

ధర్మపురి : జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత–సురేశ్ దంపతులు ఆదివారం శ్రీలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
39.0/29.0

వాతావరణం

ఆకాశం ఉదయం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

ఒడ్డుకు చేరుతున్న ఇసుక

- భారీ ఎత్తున డంప్‌లు
- గోదావరిలో రహదారుల నిర్మాణం
- రాత్రివేళల్లో గుట్టుగా తరలింపు



ట్రాక్టర్ ఢీకొని ధ్వంసమైన హనుమాన్ విగ్రహం



గోదావరి నదీ తీరంలో ఇసుక డంప్‌లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/జగిత్యాలక్రైం: ఇసుక అక్రమ రవాణాదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది. దీంతో ఏకంగా ఇసుక మాఫియా దారులు గోదావరిలోకి రహదారులను ఏర్పాటు చేసుకుని ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగిస్తూ పెద్ద ఎత్తున డబ్బు సంపాదిస్తున్నారు. వేసవి కాలం కావడంతో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ముంపు ప్రాంతమంతా తేలగా, ముంపు ప్రాంతంలో పేరుకుపోయిన ఇసుకను రాత్రివేళల్లో జేసీబీలు, లేబర్ల సహాయంతో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ గట్టు సమీపంలోని గ్రామాల్లో పెద్దఎత్తున డంప్‌లు చేస్తున్నారు.

ధర్మపురి గోదావరి నుంచి ఇసుక తరలింపు

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం తర్వాత గోదావరి నీరు ధర్మపురి ఎగువ ప్రాంతం వరకు ఉండటంతో వరద వచ్చిన సమయంలో భారీగా ఇసుక మేటలు పెట్టాయి. ఈక్రమంలో ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతో ధర్మపురి ఎగువ ప్రాంతం అంతా నీరు తగ్గింది. దీంతో ధర్మపురి, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్ గ్రామాలకు చెందిన ఇసుక అక్రమ రవాణాదారులు పెద్ద ఎత్తున గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ సమీప ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు.

అక్రమ రవాణాకు రహదారుల ఏర్పాటు

ధర్మపురి గోదావరి ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా చేసేందుకు అక్రమార్కులు నదిలోకి ట్రాక్టర్లు వెళ్లేలా రహదారులను ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి, మధ్యాహ్నం వేళల్లో అధికారుల కళ్లుగప్పి పెద్ద ఎత్తున ఇసుకను గోదావరి నది నుంచి తీస్తూ ఎగువ ప్రాంతానికి తరలిస్తున్నారు.

గ్రామ శివారులో డంపింగ్

గోదావరిలో నీటిమట్టం తగ్గడంతో భారీగా పేరుకుపోయిన ఇసుక మేటలను అక్రమ రవాణాదారులు ధర్మపురి, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్ గ్రామ శివారుల్లోకి తరలిస్తూ పెద్ద ఎత్తున డంపింగ్ చేస్తున్నారు. గత నెల రోజులుగా వేలాది ట్రాక్టర్ల ఇసుకను సమీప గ్రామాల్లో డంపింగ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు.

చోద్యం చూస్తున్న అధికారులు

ధర్మపురి గోదావరి ప్రాంతం నుంచి నెల రోజులుగా భారీ ఎత్తున ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో భారీ ఎత్తున ఇసుక డంపింగ్‌లు ఉన్నా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు అటుగా వెళ్లేందుకు జంకుతున్నారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై కథనాలు రాసిన విలేకరులపై కూడా ఇసుక మాఫియాదారులు బెదిరింపులకు పాల్పడ్డారు. కాగా, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న క్రమంలో గోదావరి నదీ తీరంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో ధ్వంసమైంది.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం



ధర్మపురి పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పరీవాహక ప్రాంతంలో గట్టి నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేస్తాం. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ, జగిత్యాల



గోదావరిలోకి ఏర్పాటు చేసుకున్న రహదారి

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జగిత్యాల: జిల్లాలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 19వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. జిల్లాలో మొత్తం 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఒక ఫ్లయింగ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, డీఈసీ బృందాలు తనిఖీలు చేస్తాయి. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో లేదా ప్రిన్సిపాల్ నుంచి తీసుకోవాలి. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేకుండా పరీక్షలకు హాజరు కావొచ్చని పరీక్షల కన్వీనర్ బి.నారాయణ తెలిపారు. ఒక నిముషం నిబంధన అమలులో ఉందని ఆయన వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

బుగ్గారం(ధర్మపురి): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక ధారుఢ్యం పెంపొందుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ కుమారుడి జ్ఞాపకార్థం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ధర్మపురి నియోజకవర్గస్థాయి బీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా వారు విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. రాపల్లి, బుగ్గారం జట్లు ఫైనల్ పోటీలకు అర్హత సాధించాయి. ఫైనల్లో రాపల్లి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నరప్ జట్టుకు రూ.30వేలు అతిథులు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ బాదినేని రాజమణి, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అక్షర సూరీడు అలిశెట్టికి నివాళి



నివాళి అర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా చేపట్టిన దశాబ్ది వేడుకల్లో ఆదివారం సాహిత్య దినోత్సవం నిర్వహించారు. స్థానిక అంగడిబజారులోని సాహితీవేత్త అక్షర సూరీడు అలిశెట్టి ప్రభాకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించండి



గోపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిరికొండలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం విక్రయించిన రైతులు డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి డబ్బులు త్వరగా మంజూరయ్యేలా చొరవ చూపాలని ఆయన డిమాండ్‌చేశారు. లేకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

'ఏం ఒరగబెట్టారని ఉత్సవాలు?'



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల: గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రప్రభుత్వం ఏం ఒరగబెట్టిందని తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ నాయకులు మాంసం, మద్యంతో విందు భోజనాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం కోసం ఎందరో బలిదానాలు చేసినప్పటికీ బీఆర్ఎస్ రాబందుల్లో చిక్కుకుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిందని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, ఉద్యోగ ఖాళీలు, నిరుద్యోగ భృతి, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాలు.. వంటి అనేక హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటం తప్ప ఉత్సవాలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు ఎంఏ నయీం, ఎలేటి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మకు బోనం మొక్కులు



మొక్కులు సమర్పిస్తున్న మంత్రి దంపతులు

బుగ్గారం(ధర్మపురి): స్థానిక ముత్యాల(నల్ల) పోచమ్మకు ఆదివారం మంత్రి కొప్పుల ఈశ్వర్, స్నేహలత దంపతులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ మూల సుమలత–శ్రీనివాస్ నివాసంలో బోనాల పండుగ నిర్వహించారు. మంత్రి దంపతులు, ఎంపీ వెంకటేశ్ నేత, ఎంపీపీ రాజమణి, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మండల కేంద్రంలోని రైతునాగలి విగ్రహాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

దళితబంధుపై చర్చకు సిద్ధమా?

- షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తామన్న హామీ ఏమైంది?
- ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నదెవరో తెలుసు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఈశ్వర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సవాల్



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై వాస్తవాలు వక్రీకరిస్తూ, ప్రజాప్రయోజనాలు తాకట్టు పెడుతున్నదెవరో అందరికీ తెలుసని, అలాంటి వారికి తగిన విధంగా బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీతో పాటు తాను మాట్లాడిన ప్రతీ అంశంపైనా బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి కొప్పుల ఈశ్వర్ సవాల్‌కు జీవన్‌రెడ్డి సమాధానం చెప్పారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలో కొనసాగిన ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడిపిస్తుందని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితబంధు కోసమని 2022–23 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఏ ఒక్కరికీ లబ్ధి చేకూర్చకపోయినా ఆశాఖ మంత్రిగా ఈశ్వర్ నోరు మెదపలేదని ఆరోపించారు. తనజాతికి అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించలేని మంత్రి ఈశ్వర్‌కు తనపై సవాల్ విసిరే అర్హత ఉందా అని నిలదీశారు. సొంత జాగాలో ఇళ్లు కట్టుకునే వారికి రూ.3లక్షల సాయం కోసం బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించగా ఎంత మందికి ఇళ్లు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ కులవృత్తులకు రూ.లక్ష పథకంలో పలు అన్ని బీసీ కులాలకు స్థానం కల్పించకపోవడం వారిని మోసం చేయడమేనని మండిపడ్డారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఎకరాకు రూ. 20వేలు నష్టపోయింది వాస్తవం కాదా? అని నిలదీశారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు జనావాసాలకు దూరంగా ఉండాలన్న సోయి కూడా మంత్రికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. మంత్రి ఈశ్వర్‌కు రైతులపై ప్రేమ ఉంటే అదే క్రిభ్‌కో ఆధ్వర్యంలో చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేశారు. ఏడాదంతా నీటి లభ్యత ఉండే కాళేశ్వరంతోనే ఏటా 420 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సౌలభ్యం ఉండగా మూడో టీఎంసీ పేరిట రైతుల నోట్లో మట్టి కొట్టుడెందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడో టీఎంసీ ముంపు భూములకు బహిరంగ మార్కెట్లో ఎకరాకు రూ.40లక్షల ధర పలుకుతోందని, ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షలు ఇచ్చి నిర్వాసితులను దగా చేసింది మీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. దళితబంధు సహా తన శాఖకు సంబంధించిన అంశాలే కాదు.. ఇతర ఏ అంశంపైన అయినా బహిరంగ చర్చకు మంత్రి కొప్పుల సిద్ధమా? అని జీవన్‌రెడ్డి ప్రతిసవాల్ విసిరారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, జున్ను రాజేందర్, మన్సూర్, గుండ మధు, బీరం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌–1 ప్రిలిమ్స్



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



మహిళా డిగ్రీ కళాశాల వద్ద పోలీసుల బందోబస్తు

జగిత్యాలటౌన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం జిల్లాలో చేపట్టిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 6,885 మంది అభ్యర్థుల కోసం వివిధ ప్రాంతాల్లో 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్దేశిత గడువుకు అభ్యర్థులు దాదాపు రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు, అధికారులు వారిని క్షుణంగా తనిఖీ చేశాక పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. అయితే, జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా చేరుకున్న ఇద్దరు అభ్యర్థులను సమయం మించిపోయిందంటూ అధికారులు వెనక్కి పంపించి వేశారు.

పటిష్ట బందోబస్తు

జగిత్యాలక్రైం: గ్రూప్‌–1 ప్రిలిమినరీకి పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగిందని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి పరీక్ష రాసేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు.. పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు జిల్లా పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ వివరించారు.

బడులు తెరుస్తున్నారు.. పనులే పూర్తికాలేదు

- జిల్లాలో మన ఊరు– మన బడి దుస్థితి
- నత్తనడకన సాగుతున్న పనులు
- పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు
- ఈఏడాది కూడా విద్యార్థులకు తప్పని తిప్పలు



- ఇదిగో.. ఇది కోరుట్ల ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదుట పిల్లర్లస్థాయిలో ఉన్న పనులు.. ఈ పాఠశాలలో మొత్తం 540 మంది విద్యార్థులు చదుకుంటారు. మన ఊరు– మన బడి కింద రూ.1.36కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో జూన్‌లో బడులు మొదలయ్యే నాటికి అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటికీ పిల్లర్లస్థాయి దాటలేదు.



- ఇది మల్లాపూర్ మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల. మన ఊరు –మన బడి కింద రూ.29 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో సాగుతున్న అదనపు తరగతి గదుల పనులు ఇప్పటికీ పిల్లర్లస్థాయిలోనే ఉన్నాయి.

కోరుట్ల: అక్కడా..ఇక్కడా అని కాదు.. జిల్లాలో మన ఊరు.. మన బడి కింద మౌలిక వసతుల కల్పన కోసం ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం పది శాతానికి మించి పనులు పూర్తికాలేదు. సోమవారం బడులు ప్రారంభిస్తారు. అందులో వసతులలేమి ఎప్పట్లాగే విద్యార్థులను వెక్కిరిస్తూనే ఉన్నాయి. జిల్లా విద్యాశాఖ నిర్లిప్తత.. కాంట్రాక్టర్ల నిరాసక్తత ఫలితంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు మళ్లీ ఇక్కట్లు పడాల్సిన దుస్థితి తప్పేట్లు లేదు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లక్ష్యంతో ప్రారంభించిన పథకం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో నత్తనడకన సాగుతోంది.

ఎక్కడిక్కడే నిర్లక్ష్యం..

- గతేడాది మేలో మన ఊరు–మన బడి పథకం కింద జిల్లాలోని 274 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.116 కోట్లు మంజూరు చేశారు.
- ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, టాయ్‌లెట్లు, వంట గదులు, విద్యుదీకరణ, తాగునీటి సరాఫరా, ఫర్నీచర్, గ్రీన్‌చాక్ బోర్డులు, ప్రహరీలు, డైనింగ్ హాల్స్ వంటి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది.
- ఆయా బడుల్లో ఎస్ఎంసీ, ఇద్దరు పూర్వ విద్యార్థులు, సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడితో కలిపి పనుల నిర్వహణ కోసం కమిటీలు ఏర్పాటు చేశారు.
- ఈ కమిటీలు నామమాత్రంగా మారడంతో టెండర్ల ప్రక్రియ పూర్తికావడంలో తాత్సారమైంది.
- ఫలితంగా పనులు కొనసాగడంలో ఎక్కడిక్కడే నిర్లక్ష్యం చోటుచేసుకుంది.

ఐదు శాతం దాటలే..

మన ఊరు–మన బడి కింద 274 పాఠశాలల్లో పనులు చేపట్టగా వీటిలో రూ.30 లక్షల పరిమితి లోపు నిధులు కేటాయించిన పాఠశాలలు 218 ఉన్నాయి. మిగిలిన 56 పాఠశాలలు రూ.కోటికిపైగా నిధులు కేటాయించినవి కావడం గమనార్హం. రూ.30 లక్షల లోపు నిధులు కేటాయించిన కేటగిరీలో కేవలం 16 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తిఅయినట్లు సమాచారం. 25 పాఠశాలల్లో పనులు చివరిదశలో ఉండగా, 12 చోట్ల కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన 165 చోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రూ.కోటికి పైగా నిధులు కేటాయించిన పాఠశాలల్లో మాత్రం పనులు ఇప్పటికీ పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. అధికార యంత్రాంగం పనుల నిర్వహణపై కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నా ఆశించినస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా మరో విద్యా సంవత్సరం విద్యార్థులు అరకొర వసతులతో బడుల్లో సర్దుకుపోవాల్సిందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

త్వరగా పూర్తిచేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈఏడాది కొత్త తరగతి గదులు నిర్మాణం పూర్తి అవుతాయని అందరం అనుకున్నాం. కానీ తరగతి గదులు ఇంకా పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. బడి బయట విద్యాబోధన చేస్తే ఈసారి కూడా మళ్లీ విద్యార్థులకు అవస్థలు తప్పేలా లేవు.

– కొక్కెర సంజీవ్, పేరెంట్, కోరుట్ల

గదులు లేక అవస్థలు



మా అబ్బాయి ఐదో తరగతి చదువుతున్నడు. పాఠశాలలో గదులు సరిగా లేక అవస్థలు అవుతున్నయి. కొత్తగా గదులు కడుతున్నారని చెప్పిండ్రు. కానీ ఇంకా పూర్తికాలేదు. ఆ పనులు పూర్తయితే పిల్లలకు ఇబ్బందులు పోతయి.

– కాసారపు లావణ్య, పేరెంట్, మల్లాపూర్

వేగవంతం చేస్తాం

మన ఊరు.. మన బడి పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. క్షేత్ర స్థాయిలో పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుని చురుకుగా సాగేలా చూస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న లచ్చయ్య

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడ గొండ గ్రామానికి చెందిన చింతలకోటి లచ్చయ్య అనే గీత కార్మికుడు ఆదివారం తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చయ్య రోజూలాగే తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకజారి కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి మూలమలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. వివరాలోకి వెళ్తే.. రాజన్నపేట తండాకు చెందిన సురేశ్, రమేశ్ నాయక్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాగట్లపల్లి మూలమలుపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు


కోనరావుపేటలో స్టిక్కర్లు అందజేస్తున్న ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి

కోనరావుపేట: మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆటోలకు మీ భద్రతే మా బాధ్యత స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్‌తో స్టిక్కర్లను ఆటోలకు అంటిస్తున్నట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణించే మహిళలు ఏదైనా ప్రమాదముందని భావిస్తే క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసి పంపించాలని, దీంతో ఆటో లొకేషన్‌ను సులువుగా గుర్తించవచ్చన్నారు. మహిళలు క్యూఆర్ కోడ్ గురించి తెలుసుకోవాలని ఏఎస్సై సూచించారు. కానిస్టేబుళ్ల సత్యం, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట ఎస్సైగా ప్రేమ్‌దీప్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై ప్రేమ్‌దీప్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట నూతన ఎస్సైగా ప్రేమ్‌దీప్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా షీటీంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఎల్లారెడ్డిపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఎస్సై శేఖర్ మెదక్ జిల్లా ఎస్పీకి అటాచ్‌గా బదిలీపై వెళ్లారు. ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సైకి పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పచ్చిరొట్ట .. పంటకు ప్రాణం

- తొలకరిలో జనుము, జీలుగ సాగు
- రసాయన ఎరువులను తగ్గించుకుంటున్నరైతులు
- జిల్లాకు 14,500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు


సాగుచేసిన జీలుగ

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో పొలాల్లో రసాయన ఎరువులను చల్లుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. పంట భూమికి సత్తువ కల్పించడంతో పాటు రసాయన ఎరువులను తగ్గించడంలో పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగపడతాయి. రైతులను ప్రోత్సహించేందుకు జనుము, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం 65 శాతం సబ్సిడీపై అందజేస్తుంది. జిల్లాకు 14,500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు రాగా, అందులో 13,300 క్వింటాళ్ల జీలుగ, 1200 క్వింటాళ్ల జనుము విత్తనాలు ఉన్నాయి.

పచ్చిరొట్ట ఎరువులంటే..

పచ్చిరొట్ట ఎరువులను పంటభూమికి రెండు రకాలుగా అందించవచ్చు. మొదటి పద్ధతిలో జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, పెసర, అలసంద, గోరు చిక్కుడు, మినుము, కంది, వేరుశెనగ, వెంపలి పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో వెదజల్లి, అవి పెరిగిన తర్వాత 50 శాతం పూతదశలో (45-60 రోజుల సమయంలో) అదే పొలంలో కలియదున్నాలి. అవి కుళ్లిన తర్వాత ప్రధాన పంట వేసుకోవాలి. రెండో పద్ధతిలో వేప, తంగెడు, కానుగ, గ్లెరిసిడియా, సుబాబుల్, గుల్‌మొహర్, పొంగామియా చెట్ల ఆకులు, కొమ్మలను బయట నుంచి సేకరించి పొలంలో వేసి కలియదున్నాలి. పొలంలో మురిగిన తర్వాత పంట వేసుకోవాలి. వరి సాగుచేసే రైతులు తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే, పొలం సిద్ధం చేసే సమయానికి పూతకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో దున్ని వరి సాగు చేసుకోవచ్చు. పండ్ల తోటల రైతులు జనుము, జీలుగ చల్లుకుంటే పెద్దగా రసాయన ఎరువులు చల్లాల్సిన అవసరం ఉండదు.

జీలుగ

చౌడు భూములతో పాటు వరి పండించే భూముల్లో ఎకరాకు 20 కిలోల జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను పొలమంతా చల్లాలి. జీలుగను పూత దశలో కలియదున్నడం వల్ల ఎకరాకు 6-8 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఎకరం పచ్చిరొట్టలో 30-32 కిలోల నత్రజని లభిస్తుంది. జీలుగలో 3.5 శాతం నత్రజని, 0.6 శాతం భాస్వరం, 1.2 శాతం పొటాష్ లభిస్తుంది. నీరు నిలిచినా పంట తట్టుకుంటుంది.

జనుము

అన్ని పంట భూముల్లో సాగు చేసుకోవచ్చు. పచ్చిరొట్టగా, పశువుల మేతగా ఉపయోగపడుతుంది. ఎకరానికి 9.2 నుంచి 14 కిలోల విత్తనం చల్లాలి. ఈ పంట ద్వారా ఎకరానికి 5.2 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. ఇందులో 2.3 శాతం నత్రజని, 0.5 శాతం భాస్వరం, 1.8 శాతం పొటాష్‌లు ఉంటాయి. త్వరగా పెరుగుతుంది. నీటి ఎద్దడి, మురుగునీటిని తట్టుకోదు.

పెసర

ఈ పంటను తేలిక, బరువైన నేలల్లో సాగు చేసుకోవచ్చు. దీన్ని ఆహారంగా, పచ్చిరొట్ట ఎరువుగా, పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. చౌడు భూముల్లో సాగుకు పనికి రాదు. ఎకరానికి 12 కిలోల విత్తనం అవసరం. ఎకరానికి 15.2 కిలోల నత్రజని అందుతుంది. ఎకరాకు అలసంద ద్వారా 4-5 టన్నులు, పిల్లి పెసర ద్వారా 4-6 టన్నుల పచ్చిరొట్ట వస్తుంది. అంతేకాకుండా, వ్యవసాయ బావులు, గట్ల వెంబడి ఉండే చెట్ల కొమ్మలు, ఆకులను పొలంలో వేసి కలియదున్నితే ఎంతో లాభం.

ఉపయోగాలివే..

పచ్చిరొట్ట పంటల్లో సేంద్రియ పదార్థం ఉంటుంది. దీంతో భూసారం పెరుగుతుంది. భూమిని గుల్లపరిచి, నీటి నిల్వ సామర్థ్యం పెంచుతుంది. పంట భూమిలో వృథాగా ఉండే పోషకాలను ఉపయోగంలోకి తేస్తాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారిస్తుంది. ఈ జాతి పంటలకు వేర్లు లోతుగా ఉండి భూమి లోపలి పొరలను కూడా ఉపయోగంలోకి తేస్తాయి. పంటల్లో సూక్ష్మపోషక పదార్థాల లోపాలు రాకుండా చేయడంతో పాటు, నులి పురుగుల ఉధృతిని తగ్గిస్తాయి.

ఏటా సాగు చేస్తాను



వరి పొలంలో ఏటా జీలుగ సాగు చేస్తున్నా. రెండు పంట సీజన్లలోనూ ఉపయోగపడుతుంది. దీంతో రసాయన ఎరువుల వాడా కాన్నితగ్గుతోంది. భూమి సారవంతంగా మారి, అధిక దిగుబడి సాధించవచ్చు.

– పురపటి రాజిరెడ్డి, లక్ష్మీపూర్, జగిత్యాల రూరల్ (మం)

దిగుబడి పెరుగుతుంది



వరి వంటి ప్రధాన పంటలకు ముందు జనుము, జీలుగ, పప్పు ధాన్యాల పంటలు సాగు చేయడంతో భూమికి సత్తువకు వస్తుంది. ప్రధాన పంటల్లో దిగుబడులు పెరుగుతాయి. రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను పొలాల్లో వేసి అందులోనే కలియదున్నితే లాభం.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

ధనిక రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టారు

- నిరుద్యోగులపై సర్కార్ చిన్నచూపు
- కర్ణాటక తరహాలో తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


పార్టీ కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం లక్షలాది కోట్ల అప్పుల్లోకి నెట్టారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్లలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ నుంచి పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటుందన్నారు. పుట్టబోయే బిడ్డపై కూడా రూ.1.50 లక్షల రుణభారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మోపుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. సిరిసిల్ల నియోజవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు ఉన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

చందుర్తి(వేములవాడ): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయమని డీసీసీ అధ్యక్షుడు, పార్టీ వేములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కట్టలింగంపేటలో కాంగ్రెస్ పార్టీ జెండాను డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాన్నున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నీడ కల్పించామన్నారు. నియోజకవర్గ వెనుకబాటుతనానికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు అసమర్థతే కారణమన్నారు. నియోజక వర్గంలోని 55వేల ఎకరాలకు సాగు నీరందించామని అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, మల్రిపల్లి రిజర్వాయర్ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదో ఎమ్మెల్యే రమేశ్‌బాబు చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో చందుర్తి జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పొద్దుపొడుపు లింగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి ధర్మపురి శ్రీనివాస్, ఆవారి రమేశ్, సంతుపూరి బాలకృష్ణా రెడ్డి, నాయకులు పులి సత్యం, యెల్ల దశరథం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలానికి చెందిన శ్రీలత గతనెల 28న సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి ఆదివారం తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి యువతికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మొబైల్ పోయినా, ఎత్తుకెళ్లినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

రాజీవ్ రహదారిపై కారు బీభత్సం


బోల్తా పడిన కారు


గాయపడిన సతీశ్ కుటుంబసభ్యులు

- డివైడర్ పైనుంచి దూసుకెళ్లి, ట్రాలీని ఢీకొన్న వైనం
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలు

తిమ్మాపూర్(మానకొండూర్): రాజీవ్ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. డివైడర్ పైనుంచి దూసుకెళ్లి, అవతలివైపు నుంచి వస్తున్న ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గాంధ్ల సతీశ్ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు కారులో వస్తున్నాడు. అదే సమయంలో ఓ ట్రాలీ కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోంది. సతీశ్ నిద్రమత్తు కారణంగా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ ఎస్బీఐ చౌరస్తా వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. డివైడర్ పైనుంచి దూసుకెళ్లి, అవతలి వైపు నుంచి వస్తున్న ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడటంతో లోపల ఉన్న నలుగురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుట్టమట్టిని అమ్మేశారు !

- లేని గుడికి చందాల వసూలు
- సర్పంచ్‌ను నిలదీసిన గ్రామస్తులు


మట్టిని తరలిస్తున్న వాహనాలు


కోనరావుపేట(వేములవాడ): ప్రజాప్రతినిధులు కలిసి ఏకంగా గుట్ట మట్టినే అమ్మేశారు. ఊరిలో లేని గుడి పేరిట ఏకంగా రూ.85వేలు వసూలు చేశారు. కోనరావుపేట మండలంలోని రామన్నపేట శివారులోని గుట్టకు చెందిన మట్టిని ప్రజాప్రతినిధులు అమ్ముకోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ధర్మారం నుంచి నాగారం, రామన్నపేట మీదుగా చంద్రగిరి వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రామన్నపేట నుంచి నాగారం గ్రామానికి వెళ్లే రహదారిలోని గుట్ట వద్ద మట్టిని తవ్వుకునేందుకు కాంట్రాక్టర్‌తో పంచాయతీ పాలకవర్గం ఒప్పందం చేసుకుంది. గ్రామంలో లేని గుడికి విరాళం పేరిట రూ.80 వేలు వసూలు చేశారు. రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ గుట్టను తవ్వుతూ మట్టిని టిప్పర్లలో తరలిస్తుండడాన్ని గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. అయితే తాను డబ్బులు చెల్లించి మట్టిని తీసుకెళ్తున్నట్లు కాంట్రాక్టర్ తెలపడంతో గ్రామస్తులు సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ మల్లేశ్‌లను నిలదీశారు. తాము కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకోలేదని, గ్రామంలో నిర్మించబోయే ఆలయానికి రూ.80 వేలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


వెంకటాపూర్ శివారులో మృతిచెందిన గేదెలు

మంథని: విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. మంథని మండలంలోని నాగెపల్లి పంచాయతీ పరిధి స్వర్ణపల్లిలో కుంభం బాపునకు చెందిన మూడు గేదెలు వెంకటాపూర్ సమీపంలో ఆదివారం మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై, చనిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ఒక్కో గేదె విలువ రూ.50 వేలు ఉంటుందన్నాడు. అలాగే ముత్తారం మండలంలోని సీతంపేటలో గుండెబోయిన ప్రసాద్‌కు చెందిన గేదె గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి, విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు.

వడదెబ్బతో వృద్ధుడు..


రాజకొమురయ్య (ఫైల్)

సైదాపూర్: మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన చిట్యాల రాజకొమురయ్య(81) వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రాజకొమురయ్య శనివారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. హుజూరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

మాయ మాటలతో మభ్యపెట్టి..

- బైక్, రూ.11వేలు, ఫోన్ అపహరణ

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి పరిచయం చేసుకొని, మాయమాటలతో మభ్యపెట్టి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. పోలీసుల వివరాలు.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన కంకటి వెంకటేశ్ ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తనది మంచిర్యాల అని వెంకటేశ్‌ను పరిచయం చేసుకున్నాడు. డీజిల్‌ను తక్కువ ధరకే పోయిస్తానని నమ్మబలికాడు. దీంతో వెంకటేశ్, సదరు వ్యక్తి జమ్మికుంటకు బైక్‌పై వచ్చారు. జమ్మికుంట హెచ్‌పీ బంక్ వద్ద కొద్ది సమయం పాటు గడిపారు. అనంతరం కొత్తపల్లి సమీపంలోని బంక్ వద్ద వెళ్లారు. ఈక్రమంలో వెంకటేశ్ బాత్‌రూంకు వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తి బాధితుడి బైక్‌తో పాటు అందులో ఉన్న రూ.11వేలు, సెల్ ఫోన్‌తో అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లయన్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మారం కుమార్


లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎంపికైన మారం కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కొనియాడారు. వేములవాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నియమితులైన మారం కుమార్ అభినందన సభ ఆదివారం నిర్వహించగా.. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ సమాజ సేవలో ముందుందన్నారు. కుమార్‌ను అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

- ఆరు నెలల క్రితమే గల్ఫ్ వెళ్లి..
- నాలుగు రోజుల క్రితమే తిరిగి వచ్చి అఘాయిత్యం
- సూసైడ్ నోట్ రాసి బలవన్మరణం


వెంకటేశం (ఫైల్)

కోరుట్లరూరల్: వెంకటాపూర్ గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశం(35) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశం నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటేశం ఆరు నెలల క్రితం దుబయి వెళ్లాడు. అక్కడ బైక్ డెలివరీ బాయ్‌గా పనిచేశాడు. బైక్ స్పీడ్‌గా నడపక పోవడంతో సంస్థ యాజమాన్యం నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో ఆ కంపెనీలో పనిమానేశాడు. ఈ క్రమంలో ఓ మిత్రుడు బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని చెప్పటంతో ఆరు నెలల పాటు ఖాళీగానే ఉన్నాడు. లోన్ రాక పోవడంతో మనస్తాపం చెందాడు. నాలుగు రోజుల క్రితమే స్వగ్రామమైన వెంకటాపూర్ చేరుకున్నాడు. తనకు ఉపాధి లేదనే మనస్తాపానికి గురైన వెంకటేశం.. ఆదివారం సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌లో ఎలాంటి సమాచారం ఉందో తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'మన ఊరు.. మన బడి' సొబగులు


ప్రారంభానికి ముస్తాబైన దోనూర్ పీఎస్

ధర్మపురి:మన ఊరు.. మన బడి కింద ఎంపికైన దోనూరు పాఠశాల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మండల వ్యాప్తంగా 18 ప్రభుత్వ పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేయగా.. తొలివడతలో దోనూర్, జైనా- (2) ప్రాథమిక పాఠశాలలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయి. జైనా పాఠశాలను వేసవి సెలవుల కన్నా ముందే.. గత ఏప్రిల్‌లోనే ప్రారంభించారు. దోనూర్ పాఠశాలను ఈనెల 20న ప్రారంభించనున్నారు. ప్రధానోపాధ్యాయుడు కాశెట్టి రమేశ్ ఆధ్వర్యంలో రూ.24.50లక్షలు వెచ్చించి అన్ని మౌలిక వసతులు కల్పించారు. విద్యుత్ ఏర్పాట్లకు రూ.2.50 లక్షలు, భవనం మరమ్మతులకు రూ.2లక్షలు, తాగునీటికి రూ.4.50 లక్షలు, ప్రహరీకి ఈజీఎస్ ద్వారా రూ.7లక్షలు, మరుగుదొడ్లకు రూ.4.50 లక్షలు, వంటగదికి రూ.4 లక్షల వరకు వెచ్చించి అందంగా తీర్చి దిద్దారు. ఐదు తరగతుల్లో మొత్తం 115 మంది విద్యార్థులు ఉన్నారు.

అన్ని వసతులు కల్పించాం



మండలంలో 18 పాఠశాలలు మన ఊరు.. మన బడి కింద ఎంపికయ్యాయి. తొలిదశలో రెండు స్కూళ్లను అన్నివిధాలా అభివృద్ధి చేశాం. విద్యార్థులకు ఇక ఎలాంటి అసౌకర్యం కలుగదు.

– భూమయ్య, ఎంఈవో, ధర్మపురి

సైబర్ నేరగాళ్లతో మోసపోయిన ఆటో డ్రైవర్

జగిత్యాలక్రైం : సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మరో వ్యక్తి మోసపోయాడు. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన ముత్యం శ్రీనివాస్ ఆటో నడుపుతున్నాడు. ఈనెల 1న శ్రీనివాస్ సెల్‌ఫోన్‌కు తన తమ్ముడు రవికుమార్ హాస్పిటల్‌లో ఉన్నట్లు రూ.20 వేలు ఫోన్ పే చేయాలని ఫొటోతో వాట్సాప్‌కు మెసెజ్ వచ్చింది. వెంటనే శ్రీనివాస్ డబ్బులు పంపించాడు. కొద్ది సేపటికి రవికుమార్‌కు ఫోన్ చేయగా తాను ఆరోగ్యంగానే ఉన్నానని, హాస్పిటల్లో లేనని చెప్పాడు. డబ్బులు కూడా తన ఫోన్‌పే కు రాలేదని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించాడు. శ్రీనివాస్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసారు.

అక్రమంగా మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు

వెల్గటూర్: మండలంలోని శాఖాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ధర్మపురి ఎక్సైజ్ సీఐ నరేశ్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మిరాల రమేశ్ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై..

జగిత్యాలక్రైం : భూ విషయంలో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన బద్రె చంద్రశేఖర్ 2014లో ధరూర్ క్యాంప్‌లో రామాలయం వద్ద సర్వే నెంబర్ 346లో తిరుపతి గౌడ్ మధ్య వర్తితత్వంతో పెరుమాడ్ల రాజశేఖర్ వద్ద భూమి కొనుగోలు చేశాడు. చంద్రశేఖర్ కొనుగోలు చేసిన భూమి రేటు పెరగడంతో తిరుపతి గౌడ్ నీ డబ్బులు నీకిస్తానని, లేకుంటే రూ.8 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో తిరుపతి గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు.